ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 25 మే 2025



కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు : డీజీపీ

మహానాడు వేదికను, అక్కడ చేపట్టనున్న భద్రతా ఏర్పాట్లకు సంబంధించి డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్త పరిశీలించారు. తొలి రెండురోజులు జరిగే ప్రతినిధుల సభ వేదిక, బహిరంగసభ వేదిక, సీఎం బస, సీఎంవో క్యాంపు ఆఫీసు, భోజనశాల, పార్కింగ్ ప్రధాన వేదికలను పరిశీలించారు. పెద్దఎత్తున జనం రానున్న నేపథ్యంలో ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లపై పోలీసులకు కీలక సూచనలు చేశారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మహానాడుపై సమీక్ష నిర్వహించారు. సీఎం సహా వీఐపీలు వస్తుండటంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. జనాలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌కు ప్రత్యామ్నామార్గాల ద్వారా వెళ్లేలా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఐజీ ఎస్.మధుసూదన్‌రెడ్డి, కర్నూలు, అనంతపురం రేంజ్ డీఐజీలు కోయ ప్రవీణ్, షమోషీబాజ్‌పేయి కడప, కర్నూలు, అన్నమయ్య, నంద్యాల, అనంతపురం ఎస్పీలు అశోక్‌కుమార్, విక్రాంతపాటిల్, విద్యాసాగర్‌నాయుడు, అధిరాజ్‌సింగ్‌రాణా, జగదీశ్, గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్‌మీనా, అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మహానాడు సభా వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, చిత్రంలో డీఐజీ, ఎస్పీ తదితరులు





భోజన వసతి కోసం రాజంపేట మార్గంలో పరిశీలిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు - గువ్వలచెరువు వద్ద భోజన ఏర్పాట్లకోసం పరిశీలన

తుదిదశకు మహాపనులు

- నేటితో మహానాడు పనులు పూర్తి
- జన సమీకరణ, వసతిపై మంత్రుల బృందం సమీక్ష
- పసుపుమయంగా మారుతున్న కడప
- రేపు నారా లోకేశ్ రాక
- వీఐపీలతో కడప కిటకిట
- పటిష్ట బందోబస్తు : డీజీపీ

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మహానాడుకు కడప ముస్తాబు అవుతోంది. ఈ నెల 27, 28, 29 తేదీల్లో నగర శివార్లలోని పబ్బాపురంలో 125 ఎకరాల్లో మహానాడు నిర్వహించనున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు.. ఇలా దాదాపు 25వేల మంది తొలి రెండురోజులు జరిగే కార్యక్రమానికి హాజరు కానున్నారు. దీనికి సంబంధించి వేదిక పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం సాయంత్రానికి దాదాపు పూర్తి కావచ్చు. తొలి రెండురోజులు 27, 28లలో నిర్వహించే ప్రతినిధుల సభకు వేదిక దాదాపు పూర్తయింది. భోజనశాల, సీఎంవో క్యాంపు ఆఫీసు, ఫొటోఎగ్జిబిషన్, రక్తదాన శిబిరం పనులు పూర్తయ్యాయి. ఇక చివరి రోజు 29వతేదీన నిర్వహించే బహిరంగసభ వేదిక పనులు 70 శాతం పూర్తయ్యాయి. గ్యాలరీ పనులూ పూర్తయ్యాయి. ఆదివారం రాత్రికి అన్ని పనులు పూర్తి కానున్నాయి. ఇక ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకండా ఉండేందుకు పార్కింగ్ ప్రదేశాలను ముమ్మరంగా శుభ్రం చేస్తున్నారు. బహిరంగసభ అనంతరం వాహనాలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు గాను రింగురోడ్డులో అక్కడక్కడా డివైడర్లను తొలగిస్తున్నారు.

కడప పసుపుమయం

మహానాడు సందర్భంగా కడపను పసుపుమయంగా మారుస్తున్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ సర్కిల్, సంధ్యాసర్కిల్, ఐటీఐ ఇతర సర్కిళ్లన్నీ పసుపు మయం చేశారు. రోడ్డు పొడవునా పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మహానాడు సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సోమవారం కడపకు రానున్నారు. మహానాడు ఏర్పాట్లపై జనసమీకరణపై చర్చించనున్నారు.

జన సమీకరణపై..

మహానాడుకు జన సమీకరణపై ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మంత్రుల బృందం చర్చించింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి బహిరంగసభకు వచ్చే జనాలకు పులివెందులలో భోజన వసతి ఏర్పాటు చేస్తామని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి వెల్లడించారు. దాదాపు 20వేల మందికి ఇక్కడ భోజన సదుపాయం కల్పించనున్నట్లు వివరించారు. ఇక ఐదులక్షల మందితో భారీ బహిరంగసభ నిర్వహించాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యం. అందుకు తగ్గట్లు కడప చుట్టుపక్కల 50 నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేయనున్నారు. కడప జిల్లా నుంచే 2.10 లక్షల మందిని తీసుకురావాలని టార్గెట్ ఇచ్చారు. ఇక పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, జమ్మలమడుగు, బద్వేలు ఇన్‌చార్జిలు భూపేశ్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా రాజు, అనుడా చైర్మన్ రూపానందరెడ్డితో మంత్రులు అనగాని సత్యప్రసాద్, సంధ్యారాణి, బీసీ జనార్ధనరెడ్డి, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీటీ నాయుడు, రవిచంద్రలు జన సమీకరణపై చర్చించారు. ఇచ్చిన టార్గెట్ ప్రకారం జనాలను సమీకరించాలని నిర్ణయించారు. వాహనాల కొరత లేకుండా చూడాలన్నారు.

మంత్రుల కమిటీ సమీక్ష

మహానాడు ప్రాంగణ పనులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనర్ధానరెడ్డి, నిమ్మల రామానాయుడు, సంధ్యారాణి, మంత్రి రవికుమార్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీద రవిచంద్రయాదవ్, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వర్‌రావు, దామచర్ల సత్య తదితరులు శనివారం పరిశీలించారు. బహిరంగసభకు హాజరయ్యే కార్యకర్తలు, నాయకులు, జనాలకు భోజన ఏర్పాట్లను పర్యవేక్షించారు. బహిరంగసభకు వచ్చేవారి కోసం ఐదు ఎంట్రీ పాయింట్లను గుర్తించారు. పులివెందుల రోడ్డు, తాడిపత్రి-కమలాపురం రోడ్డు, మైదుకూరు-కర్నూలు రోడ్డు, సిద్దవటం-బద్వేలు రోడ్డు, సీకేదిన్నె-రాజంపేట రోడ్డులోని రిమ్స్ హాస్పిటల్ ప్రాంతాన్ని ఎంట్రీ పాయింట్లుగా గుర్తించారు. ఈ మేరకు ఆ ప్రాంతాలకు వెళ్లి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ ఐదురోడ్ల ఎంట్రీ పాయింట్లలో ఐదు కి.మీ ముందు నుంచే మహానాడు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి బృందం సూచించింది. భారీ ఎత్తున జనం రానుండడంతో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మహానాడుకు తరలివచ్చేవారికి వసతి, భోజన వసతిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి బహిరంగసభకు వచ్చే నాయకులు, కార్యకర్తలకు గువ్వలచెరువు వద్ద ఏర్పాటు చేసిన భోజన ఏర్పాట్లను మంత్రి మండిపల్లె రాంప్రసాద్, బీసీ జనార్ధనరెడ్డి పరిశీలించారు. ఇక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు.



మహానాడు ఏర్పాట్లపై ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మెల్యేలతో సమీక్షిస్తున్న మంత్రులు



మహానాడు వేదిక వద్ద మంత్రి నిమ్మల రామానాయుడు, డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్, తదితరులు

హత్యాచారం నిందితుడిని అప్పగించండి

- రోడ్డుపై బైఠాయించి బాధితుల ఆందోళన

జమ్మలమడుగు, మే 24 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె గ్రామంలో చిన్నారిని చిదిమేసిన నిందితుడిని తమకు అప్పగించాలంటూ బాలిక తల్లిదండ్రులు, బంధువులు శనివారం జమ్మలమడుగు పాత బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట రోడ్డుపై బైఠాయించారు. వారికి మద్దతుగా జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సింగం శివ మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, వెంకటస్వామి, మర్రిప్రకాశం తదితరులు నిరసన తెలిపారు. అలాగే దళిత ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కోలా ప్రసాద్, స్థానిక సంఘాల నేతలు వీరికి మద్దతు తెలిపారు. చిన్నారి తల్లి మాట్లాడుతూ తమ కుటుంబానికి జరిగిన అన్యాయం ఇతరులకు జరగరాదన్నారు. నిందితుడిని తమకు అప్పగించితే అతడిని నరికేస్తామని, అతడు భూమి మీద బతకరాదని ఆవేదనతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా బాధితులు సుమారు 40 నిమిషాలపాటు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ఈ విషయం తెలిసి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అక్కడకు చేరుకున్నారు. బాధితులంతా ఆయనను చుట్టుముట్టి న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. చిన్నారి తండ్రికి ఉద్యోగం ఇస్తామని, ఇంటి స్థలం కేటాయించి ఇల్లు మంజూరు చేస్తామని, ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు అందజేస్తామని తెలిపారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు. కాగా.. ఎస్పీ అశోక్‌కుమార్ మైలవరం మండలం ఎ.కంబాలదిన్నెలో ఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జమ్మలమడుగుకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. ఈ దారుణం క్షమించరానిదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు లింగప్ప, గోపాల్‌రెడ్డి, ఎస్ఐలు హైమావతి, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, ఇతర ప్రాంతాలకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద కలెక్టర్‌ను చుట్టుముట్టిన బాధితులు

సీఎం పర్యటనకు పటిష్ఠమైన ఏర్పాట్లు

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప, మే 24 (ఆంధ్రజ్యోతి): మహానాడు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 26 నుంచి 29 వరకు కడపలో బసచేయనున్నారు. ఈ నేపథ్యంలో సీఎం పర్యటనకు పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. నగర శివారులోని పబ్బాపురంలో జరిగే మహానాడుకు చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. దీంతో శనివారం ఎస్పీ అశోక్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ తొలుత కడప విమానాశ్రయాన్ని పరిశీలించారు. అనంతరం సీఎం బస చేసే ప్రాంతం, బహిరంగ సభ వేదికను పరిశీలించారు. ఎయిర్‌పోర్టు, సభ వేదిక వద్ద భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. కడప విమానాశ్రయం నుంచి సీఎం చంద్రబాబు ప్రయాణించే రోడ్డు వెంట, వేదిక వద్ద ప్రొటోకాల్ పాటించాలని ఆదేశించారు. కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఘోరం

- కారుపై పడ్డ లారీ..
నుజ్జునుజ్జు అయిన కారు
- నలుగురుమృతి..

7



జిల్లా పేరు మార్పుపై అభ్యంతరాలు నిల్

7

లిక్కర్ స్కామ్‌లో జగన్‌రెడ్డి జైలుకెళ్లడం తథ్యం

- కనీవినీ ఎరుగని రీతిలో పసుపు పండుగ
- పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

కడప మారుతీనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో సాగిన లిక్కర్‌స్కామ్ కేసులో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి జైలు ఊసలు లెక్కించడం తథ్యమని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పష్టం చేశారు. ఓబులాపురం గనుల అక్రమ తవ్వకాలలో గాలి జనార్ధన్‌రెడ్డిని దోషిగా నిర్ధారించి సీబీఐ న్యాయస్థానం 7 సంవత్సరాల జైలుశిక్ష విధించిన విషయం తెలిసిందే అన్నారు. ఆ లెక్కన గాలి జనార్ధన్‌రెడ్డి కంటే కూడా అధిక కేసులున్న జగన్‌రెడ్డి జైలులో ఎన్ని సంవత్సరాలుంటాడో ఊహకందడం లేదన్నారు. వచ్చే మహానాడులోగా జగన్‌రెడ్డి, అతనేర్పాటుచేసిన వైసీపీ అడ్రస్ లేకుండా పోతాయని జోష్యం చెప్పారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, నంద్యాల వరదరాజులరెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, పులివెందుల ఇన్‌చార్జ్ బీటెక్ రవి, బద్వేల్ ఇన్‌చార్జ్ రితేశ్‌రెడ్డి, జమ్మలమడుగు ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి, మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకూ కడపజిల్లాలో మహానాడు జరగలేదన్నారు. ప్రప్రథమంగా ఈనెల 27, 28, 29 తేదీలలో అత్యంత ప్రతిష్టాత్మకంగా మహానాడు పండుగ జరుగనుందన్నారు. దీనిని కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేసేలా ఉమ్మడి జిల్లాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. మహానాడు ఏర్పాట్లను చూసి తట్టుకోలేని వైసీపీ నాయకులు కరోనాను బూచిగా చూపుతున్నారని, వారి పిల్లి శాపనార్థాలను ప్రజలు పట్టించుకోవాల్సిన అవసరమే లేదన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, భూపేశ్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి, ముక్కా రూపానందరెడ్డి

రూ.కోట్ల భూమిపై కన్ను



- బీకే పల్లెలో మరో భూమాయకు శ్రీకారం
- రికార్డులు తారుమారు చేసి..విస్తీర్ణం పెంచేసి
- దళారులుగా రెవెన్యూ సిబ్బంది
- వైసీపీ నేతల సిఫార్సుతో ముందుకు
- వివాదం భూమి అధీనంలో ఉన్నట్లు ధ్రువీకరణ
- ఎన్‌వోసీకి రంగం సిద్ధం.. సర్వే రిపోర్టే తరువాయి



సమాచారం హక్కుచట్టం ప్రకారం జారీ చేసిన సర్వేనంబర్లు 531, 538 సర్వే నెంబర్లు, అందులోని విస్తీర్ణం

మదనపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని బీకే పల్లె సర్వే నెంబర్-531-2ఎలో 1.61 ఎకరాలు, 538-1లో 3.38 ఎకరాలు ఓ వ్యక్తికి దరఖాస్తు పట్టా ఇచ్చినట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. ఏఎం ఫైల్ నెంబర్-12-19వజేబీ-4-1413, జూలై 2003వ తేదీ 19వ జన్మభూమిలో ఇచ్చినట్లు నంబర్ ఫోర్ రిజిస్టర్‌లో నమోదు చేశారు. ఆ ఫైలులో సర్వే నెంబర్-538-1లో 3.38 ఎకరాలు, సర్వే నెంబర్-531-2ఏలో 1.61 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో సర్వే నెంబర్-531-2ఏలోని విస్తీర్ణానికి ఇటీవల ఎన్‌వోసీ జారీ చేశారు. అంతవరకూ బాగానే ఉన్నా తర్వాత అదే నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లోని సర్వే నెంబర్-538-1ను మార్పు చేసి సర్వే నెంబర్-552-1గా చూపించినట్లు తెలుస్తోంది. దీనికి కూడా ఎన్‌వోసీ జారీ చేసే క్రమంలో ముందు జరగాల్సిన ప్రక్రియ మొదలుపెట్టారు. అదే వ్యక్తికి ఈ సర్వే నెంబర్‌లో 2.88 ఎకరాల విస్తీర్ణంతో దరఖాస్తు పట్టా ఇచ్చినట్లు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. అయితే ఒరిజినల్ ఫైలులో సర్వే నెంబర్-538-1లో 3.38 ఎకరాలు విస్తీర్ణం ఉంటే, దిద్దుబాటు చేసిన నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లో 552-1ఏ1లో 2.88 ఎకరాలుగా చూపించారు. కానీ ఎన్‌వోసీ జారీ చేసిన సర్వే నెంబర్-531-2ఏలో 2.11 ఎకరాలు చూపించారు. అంటే ఒరిజినల్ ఫైలులో 1.61 ఎకరాలు ఉంటే, ఎన్‌వోసీ జారీ చేసేటప్పటికి 2.11 ఎకరాలకు అయి 50 సెంట్లు విస్తీర్ణం పెంచేశారు. అంటే సర్వే నెంబర్లు మారినా, దిద్దుబాటు చేసినా..విస్తీర్ణం మాత్రం 4.99 ఎకరాలు వచ్చేలా అక్కడా, ఇక్కడా జాగ్రత్త పడినట్లు స్పష్టమవుతోంది. ఇలా బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కొట్టేసే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆ సమాచారం వెనక్కి ఇవ్వండి

దరఖాస్తుదారుడికి ఇచ్చిన భూమి వివరాలు కావాలని ఓ వ్యక్తి..సమాచార హక్కుచట్టం ప్రకారం వివరాలు అడిగారు. అయితే రెవెన్యూ అధికారులు ఆ సమాచారంతో కూడిన రికార్డు ఇచ్చారు. వీటిని పరిశీలిస్తే ఒరిజినల్ ఫైలులోని సర్వే నెంబర్లు, విస్తీర్ణం, తర్వాత దిద్దిన ఫైలుకు తేడాలు గుర్తించారు. నంబర్ ఫోర్ ఒరిజినల్ స్కాన్డ్ కాపీలో సర్వే నెంబర్లు-531, 538లు ఉండగా, తర్వాత అదే నంబర్ ఫోర్ రిజిస్టర్‌లో సర్వే నెంబర్-538 స్థానంలో 552-1 సర్వే నెంబర్ వచ్చి చేరింది. ఇది పెద్దిరెడ్డి కుటుంబం పేరున రిజిస్ట్రేషన్ అయిన భూమి పక్కనున్న సర్వే నెంబర్. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ రెవెన్యూ ఉద్యోగి విషయం తెలుసుకుని ఆ సమాచారాన్ని వెనక్కి తెప్పించుకుంటున్నారు. ఇందులో ఇబ్బంది పెడితే, తర్వాత నీ సబ్డివిజన్‌లో ఇబ్బంది పెడతానని బెదిరిస్తున్నట్లు బాధితుడు వాపోతున్నాడు. నిజంగా అదే వ్యక్తికి దరఖాస్తు పట్టా ఇచ్చి ఉంటే సర్వే నెంబర్-531లో భర్త నుంచి భార్య పేరున మ్యుటేషన్ అయినట్లు, సర్వే నెంబర్-552-1లో కూడా ఎందుకు చేయలేదో అధికారులకే తెలియాలి మరి.

మార్పు ఎందుకు చేశారు?

దరఖాస్తు పట్టాలో రెండు సర్వే నెంబర్లతో కూడిన 4.99 ఎకరాలు విస్తీర్ణంతో పట్టా ఇస్తే, ఒక నెంబర్‌ను మాత్రం అలాగే పెట్టి రెండో నెంబర్‌ను మార్పు చేయడం వెనుక అంతర్యం చాలానే ఉన్నట్లు తెలుస్తోంది. మార్పు చేసినట్లుగా కనిపిస్తున్న సర్వే నెంబర్-538లో భూమి లేకపోవడం, ఉన్నా..ఇళ్లు కట్టుకుని చాలామంది పొజిషన్ సర్టిఫికెట్లు తీసుకోవడం, తదితర కారణాలు ఉన్నట్లు చెబుతున్నారు. అలాగే ఆ భూమి రోడ్డుకు లోపలవైపున ఉన్నా ఇలాంటి వ్యవహారాలే చేస్తుంటారు. మరోవైపు సర్వే నెంబర్-552-1 బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న విలువైన భూమి కావడం కూడా మార్పునకు కారణంగా చెబుతున్నారు.


పేరు ఒకరిది..ఫలితం మరొకరిది..

దరఖాస్తు పట్టా పొందిన వ్యక్తి స్థానికంగా కాకుండా బయటి ప్రాంతానికి చెందిన వ్యక్తి. అది కూడా ఆయనకు జన్మభూమిలో దరఖాస్తు పట్టా ఇచ్చినట్లు నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లో నమోదు చేయగా మాజీ సైనికుడి కోటాలో ఇచ్చినట్లు ఎన్‌వోసీలో చూపించారు. జన్మభూమిలో దరఖాస్తు పట్టా అంటే స్థానికంగా ఉండే వ్యక్తులకే ఇస్తారు..కానీ ఎక్కడో పీలేరు నియోజకవర్గంలో ఉండే వ్యక్తులకు నిబంధనల ప్రకారం ఇవ్వరు. ఇదిలావుండగా, పట్టా ఎవరికో ఇస్తే..వాల్మీకిపురానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ముందుండి నడిపించినట్లు తెలిసింది. వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయంలో అప్పట్లో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు ఈ వ్యవహారాన్ని అప్పటి నుంచి ఇప్పటి వరకు నడుపుతున్నట్లు రెవెన్యూ శాఖాధికారులు చెబుతున్నారు.

దిద్దుబాటు చేసిన సర్వే నెంబర్-552-1ను పరిశీలిస్తే..

సర్వే నెంబర్-552-ఏ1లో 2.88 ఎకరాలు దరఖాస్తు పట్టా పొందినట్లు చూపిస్తున్న ఆ వ్యక్తి 2020లో ఎన్‌వోసీకి దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై 2023లో విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు ఆ వ్యక్తికి పట్టా ఇచ్చారని, ఆ భూమి వారి అధీనంలో ఉందని చూపించారు. అయితే క్షేత్రస్థాయిలో ఆ భూమిపై ఆరా తీస్తే ఎన్నో వివాదాలు, ఇబ్బందులు మరెన్నో ఉన్నాయి. పైగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భార్య పేరున ఉన్న భూమి పక్కనే ఉందని చెబుతున్నారు. సర్వే నెంబర్-552-1పార్టులో 1.35 ఎకరాల ప్రభుత్వ భూమిని పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించగా, స్వాధీనం చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ఆ భూమినే ప్రస్తుతం నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లో మార్పులు, చేర్పులు చేసిన సర్వే నెంబర్ విస్తీర్ణాన్ని కట్టే బెట్టే ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే సగం ప్రక్రియ పూర్తి కాగా, ఇక సర్వేయర్ నుంచి సబ్‌డివిజన్ రిపోర్టు కోసం వేచి ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అంటే పెద్దిరెడ్డి కుటుంబం కబ్జా నుంచి స్వాధీనం చేసుకున్న భూమి ప్రస్తుతానికి అధికారుల ప్రకటనల ప్రకారం ప్రభుత్వ భూమే అయినా..తర్వాత అనుకున్న కార్యాన్ని చక్కబెట్టే ప్రయత్నం జరుగుతున్నట్లు ఆ శాఖలో ప్రచారం జరుగుతోంది.

ఇది వరకే సర్వే నెంబర్-531లోని విస్తీర్ణానికి ఎన్‌వోసీ పొందిన వ్యక్తే..సర్వే నెంబర్-552-1లో తనకు జారీ చేసిన 2.88 ఎకరాల భూమిని 22ఏ జాబితా నుంచి తొలగించాలని 2020 అక్టోబరులో దరఖాస్తు చేసుకోగా 2023లో విచారించినట్లు నివేదిక ఇచ్చారు. అయితే 552-1లో 7.28 ఎకరాల విస్తీర్ణం ఉండగా, అది సబ్‌డివిజన్ కాలేదని సూచించారు. అయితే దరఖాస్తుదారుడు మాత్రం 1.70 ఎకరాల్లో అనుభవంలో ఉన్నట్లు చూపించారు. దీనిపై సర్వే చేపట్టి సబ్‌డివిజన్ చేయాలని నివేదిక ఇవ్వాలని, కలెక్టర్, స్థానిక తహసీల్దార్ ధనంజయులును ఆదేశించారు. తహసీల్దార్ ఇచ్చే రిపోర్టు ఆధారంగా ఎన్‌వోసీకి వెళ్లే ప్రయత్నాలు మొదలు పెట్టారు.



దిద్దిన తర్వాత నెంబర్ ఫోర్ రిజిస్టర్‌లో మారిన సర్వే నెంబర్-552-1ఏ1


ఆ ఫైలుపై విచారణ చేస్తున్నాం

ఆ ఫైలుపై కొర్రీ వేసి కలెక్టర్ వెనక్కి పంపారు. సర్వే నెంబర్-552-1 రికార్డులు ఎవరికి ఉన్నాయో పరిశీలిస్తున్నాం. మావి అని వచ్చే వారిని కూడా పిలిపిస్తున్నాం. ఇప్పటికే పంపించిన ఫైలును కలెక్టర్ వెనక్కి పంపించారు. వారం రోజుల్లో విచారించి నివేదిక ఇవ్వమన్నారు. నెంబర్ ఫోర్ రిజిస్టర్ ప్రకారం వివరాలు నమోదు చేసిన, ధ్రువీకరించిన అప్పటి డీటీ రఫిక్ అహ్మద్‌ను కూడా పిలిపించి విచారిస్తున్నాం. అయితే సర్వే నెంబర్-552-1లో 1.70 ఎకరాలు వారి అధీనంలో ఉందని కలెక్టర్ జారీ చేసిన సర్టిఫికెట్‌ను నేను చూడలేదు. ఒకసారి పరిశీలిస్తా.

\- మేఘస్వరూప్, సబ్‌కలెక్టర్, మదనపల్లె

హార్సిలీహిల్స్‌లో ఆ..రెస్టారెంట్‌కు గ్రీన్‌సిగ్నల్

బి.కొత్తకోట, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లోని లగ్జరీ ప్రైవేటు హోటల్ వీఎస్సార్ విండ్ వేవ్‌కు అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. హిల్స్‌పై విలాసవంతమైన భోజనం, విడిది, ఈవెంట్ల నిర్వహణకు కేంద్రమైన ఈ ప్రైవేటు రెస్టారెంట్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తోందని, ఈ రెస్టారెంట్ మురుగునీరు పర్యాటకులు అధికంగా సంచరించే గాలిబండపైకి వెళుతోందని, వ్యర్థపదార్థాలు, చెత్తను బహిరంగ ప్రదేశంలో వేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ శ్రీధర్ ఆదేశాలతో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ బి.కొత్తకోట తహసీల్దార్ అజారుద్దీన్ చేత ఈనెల 9న సీజ్ చేయించారు. అప్పట్లో ఇది సంచలన నిర్ణయంగా అందరూ భావించారు. కనీసం 15 రోజులు కూడా గడవక ముందే మురుగునీటి నిల్వకు దారి చూపి, వ్యర్థపదార్థాల తరలింపునకు సలహాలిచ్చి సీజ్ చేసిన అధికారుల చేతనే రీ ఓపెనింగ్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. దీంతో శనివారం ఆ రెస్టారెంట్ మళ్లీ ప్రారంభమైంది. ఈ వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.



హార్సిలీహిల్స్‌లోని వీఎస్సార్ విండ్ వేవ్ రెస్టారెంట్

పంచాయతీలో అవకతవకలపై విచారణ

ఒంటిమిట్ట, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం, అక్రమాలపై జమ్ములమడుగు డీఎల్పీవో సుబ్రమణ్యం విచారణ చేపట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై ముందుగా డీఎల్పీవో స్థాయి అధికారి విచారణ చేపట్టారు. విచారణ నివేదిక సక్రమంగా లేదని గుర్తించిన జిల్లా అధికారులు డీఎల్పీవోను నియమించారు. శనివారం డీఎల్పీవో సుబ్రమణ్యం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శులు రికార్డులు తమ వద్ద లేవని ముందు విచారణ అధికారిగా ఉన్న ఆయన వద్ద ఉన్నాయని తెలియజేశారు. 27వ తేదీ నుంచి విచారణ ప్రారంభిస్తానని, ఆలోపు రికార్డులను తెప్పించుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గౌస్‌బాషా, ఈవోపీఆర్డీ ప్రసాద్, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

టీడీపీ నేత కారుపై దాడి

గుర్రంకొండ, మే 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత ఎల్లుట్ల మురళీకృష్ణ కారుపై గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి దాడి చేసి కారు అద్దం ధ్వంసం చేశారు. మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ శీలంవారిపల్లెకు చెందిన ఎస్.మురళీకృష్ణ టీడీపీ మండల నేతగా ఉన్నారు. ఇందులో భాగంగా కడపలో జరగనున్న మహానాడు సభ పనులను పర్యవేక్షించడానికి శుక్రవారం పీలేరు ఎమ్మెల్యే వెళుతుండడంతో ఆయనతో కలిసి వెళ్లారు.

అక్కడ నుంచి తిరిగి గుర్రంకొండకు వచ్చి స్వగ్రామానికి వెళ్లడానికి ఇంటి నుంచి కారు తీసుకురావాలని బావమరిది రెడ్డిశేఖర్‌కు సూచించారు. రెడ్డిశేఖర్ కారులో శీలంవారిపల్లె నుంచి గుర్రంకొండకు వస్తుండగా మార్గమధ్యంలోని సంగసముద్రం పంచాయతీ పరిధిలోని కంకరమిషన్ వద్దకు రాగానే గుర్తు తెలియని దుండగులు కారుపై దాడి చేశారు. దుండగుల దాడిలో కారు ముందు అద్దం ధ్వంసమైంది. కారు లోపల కారం పొడి కూడా చల్లారు. ఈ విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డ్రైవర్‌గా వచ్చిన రెడ్డిశేఖర్ ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో రాత్రికి రాత్రే పోలీసులు దాడిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం ఉదయాన్నే దాడి జరిగిన ప్రదేశంలో ఫోన్ కాల్స్ డంప్, సీడీఆర్ఎస్ వివరాలను సేకరించే పనులను పోలీసులు ముమ్మరం చేశారు.

ఈ నేపథ్యంలో కారు డ్రైవర్‌గా వచ్చిన రెడ్డిశేఖర్‌తో దాడి జరిగిన తీరుపై పోలీసులు వివరాలను ఆరా తీశారు. ఈ దాడి ఏ కోణంలో జరిగిందోనన్ని పలు కోణాల్లో పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో కేసును చేధించి నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ రఘురాం తెలిపారు.



దుండగుల దాడితో పగిలిన కారు అద్దం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తంబళ్లపల్లె/పెద్దమండ్యం మే 24 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. పెద్దమండ్యం మండలం ముసలికుంట పంచాయతీ గోనుపోతులపల్లెకు చెందిన శేషప్పనాయుడు (32) ఇటీవల కువైత్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం భార్య అపర్ణతో కలసి మదనపల్లెకు వెళ్లి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తన అత్తకు ఆపరేషన్ చేయించాడు. అక్కడి నుంచి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళ్తుండగా తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె ఆర్చి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. కాగా మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



శేషప్పనాయుడు (ఫైల్)

దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో టైలరింగ్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులపై శిక్షణ పొందేందుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, టీవో నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు ఉంటుందన్నారు. 15 నుంచి 45 ఏళ్ల లోపు మహిళలు ఈనెల 29 లోగా స్కిల్ హబ్ సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ చౌడయ్య నెం:9618655759 నెంబరులో సంప్రదించాలని కోరారు.

దాడి కేసు నమోదు

బి.కొత్తకోట, మే 24 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో తన దాయాదిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని గోళ్లపల్లెలో చిల్లరదుకాణం నడుపుకుంటున్న వీరప్ప (42)పై అతని దాయాది వెంకటేశ్వర (45) శనివారం దాడి చేసి గాయపరిచాడు. అడ్డు వచ్చిన తన భార్య విజయలక్ష్మి, తండ్రి నారాయణను దూషించడంతో పాటు బెదిరించాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బి.కొత్తకోట పోలీసులు తెలిపారు.

రేపటి లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలి

రాజంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు దగ్గరగా ఉన్న ఐటీఐల్లో ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఆర్.రఘురామిరెడ్డి తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకోకపోతే మెరిట్ లిస్టులో పేరు ఉండదని, కావున ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

మద్యం మత్తులో దాడి: ఒకరికి తీవ్రగాయాలు

రైల్వేకోడూరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇద్దరు యువకులు ఘర్షణ పడటంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.... రైల్వేకోడూరు మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పరిధిలోని మద్యం షాపు సమీపంలో రైల్వేకోడూరు పట్టణానికి చెందిన పోకల అరవింద్, రైల్వేకోడూరు పట్టణంలోని అంకమ్మనగర్‌కు చెందిన పగడాల రామక్రిష్ణతేజ కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో మద్యం బాటిల్‌తో పోకల అరవింద్‌పై రామక్రిష్ణతేజ దాడి చేయడంతో అరవింద్ మెడపై తీవ్ర గాయమైంది. అరవింద్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

కాగా రామక్రిష్ణతేజను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడి గల కారణాలు తెలియరాలేదు. ఈ సంఘటన పై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ హేమసుందర్ తెలిపారు.



గాయపడ్డ పోకల అరవింద్

సమన్వయ లోపం...నిర్మాణాల్లో జాప్యం

- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపంతో నత్తనడకన ఆర్వోబీల పనులు
- కోర్టు కేసులతో చిత్తూరు మార్గంలో అడ్డంకులు
- స్థల సేకరణ, ట్రాఫిక్ సమస్యలతో మదనపల్లె ఆర్వోబీ ఆలస్యం

పీలేరు/పీలేరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం కారణంగానే పీలేరులో జరుగుతున్న ఆర్వోబీల నిర్మాణ పనుల్లో విపరీతమైన ఆలస్యం జరుగుతోంది. వంతెనల నిర్మాణానికి సహకరించాల్సిన శాఖలు, వాటి అధికారులు అలసత్వం ప్రదర్శిస్తుండడంతో వాటి ఫలితం నిర్మాణ పనులపై పడుతోంది. పీలేరులో సాగుతున్న ఆర్వోబీల నిర్మాణ తీరుపై ఈనెల 20వ తేదీ 'ఎన్నాళ్లీ ఈ యాతన' అన్న శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై ఎన్‌హెచ్ అధికారులు స్పందించారు. ఆర్వోబీల నిర్మాణాల్లో తమకు ఎదురవుతున్న సమస్యలను సమగ్రంగా వివరించారు. కోర్టు కేసుల కారణంగా చిత్తూరు మార్గంలో పనులు ఆలస్యం అవుతుండగా, స్థల సేకరణ, ట్రాఫిక్ కారణంగా మదనపల్లె మార్గంలో పనులు ఆలస్యంగా సాగుతున్నట్లు ఎన్‌హెచ్ ఏఈ మాధవన్ తెలిపారు.



రాత్రి పూట గడ్డర్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



రైల్వే క్రాసింగ్ వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు

వ్యవస్థలో లోపాలకు సాక్ష్యంగా సర్వే నెం-93

పీలేరు-చిత్తూరు మార్గంలోని రైల్వే క్రాసింగ్ సమీపంలో ఉన్న సర్వే నెం.93 ప్రభుత్వ వ్యవస్థల్లోని లోపాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రభుత్వ రికార్డుల్లో ఆ సర్వే నెంబరు పూర్తిగా ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్నప్పటికీ గతంలో ఆ సర్వే నెంబరులోని భూమిపై కొనుగోళ్లు జరిగాయి. ఆ కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించి పీలేరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయి. ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయో అప్పటి అధికారులకే తెలియాలి. ఆ రిజిస్ట్రేషన్ల ఆధారంగా ఆ సర్వే నెంబరులో ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసిన 12 మంది హైకోర్టును ఆశ్రయించారు. తాము కొనుగోలు చేసిన భూమికి పరిహారం చెల్లించాలని వారు కోర్టును ఆశ్రయించగా, భూమి ప్రభుత్వానిదే అయినప్పుడు పరిహారం ఎలా చెల్లిస్తామని ఎన్‌హెచ్, రెవెన్యూ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఆ భూముల్లో కట్టుకున్న భవనాలకు పరిహారం చెల్లించినందున వెంటనే వాటిని ఖాళీ చేయాలని ఎన్‌హెచ్ అధికారులు కోరుతుండగా భవన యజమానులు కోర్టును ఆశ్రయించడంతో ఆ మార్గంలో పనులు నిలిచిపోయాయి. పీలేరు-చిత్తూరు మార్గంలోని రైల్వే క్రాసింగ్‌పై చేపట్టిన ఆర్వోబీ పనులు కోర్టు కేసుల కారణంగా పూర్తిగా స్తంభించిపోయాయి. ఆర్వోబీ నిర్మాణానికి ఆయువుపట్టు లాంటి సర్వే నెం93లో స్థల సేకరణపై కోర్టు కేసు నడుస్తుండడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

రైల్వే క్రాసింగ్ మార్పు కోసం...

మదనపల్లె మార్గంలోని రైల్వే క్రాసింగ్‌ను మార్చాల్సి రావడంతో ఇక్కడ కూడా పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఆర్వోబీ నిర్మాణం కోసం రైల్వే క్రాసింగ్‌ను మార్చాల్సి ఉంది. ఆ మార్పునకు అనుగుణంగా స్థల సేకరణ చేయాల్సి రావడంతో వాటి కారణంగా పనులు ఆలస్యం అయ్యాయి. అయితే ఇక్కడ కేవలం ఒక ఇంటి కారణంగా పనులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడింది.

స్థల సేకరణ జరిపిన ఓ ఇంటిపై ఆ భవన యజమానికి, విద్యుత శాఖాధికారుల మధ్య వివాదం నెలకొంది. తమకు రావాల్సిన బకాయిలు వచ్చేంత వరకు ఆ ఇంటిని కూల్చొద్దని విద్యుత్ శాఖాధికారులు ఎన్‌హెచ్ అధికారులపై ఒత్తిడి తేవడంతో వారు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అంతేకాకుండా మదనపల్లె-తిరుపతి మార్గంలో నిత్యం ట్రాఫిక్ ఎక్కువగా ఉండడం వల్ల పగటిపూట తాము పనులు చురుగ్గా చేయలేకున్నామని, స్థానిక అధికారులు పూనుకుని ట్రాఫిక్‌ను కొత్తగా నిర్మితమై అందుబాటులోకి వచ్చిన బైపాస్ మార్గం గూండా మళ్లించాలని బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టర్లు కోరుతున్నారు. వారి అభ్యర్థన కార్యరూపం దాల్చకపోవడంతో వారు కేవలం రాత్రి పూట మాత్రమే పనులు సాగిస్తున్నారు. భారీ క్రేన్ల సాయంతో గడ్డర్లు బిగించాల్సి ఉండడంతో ప్రాణనష్టం భయంతో వారు రాత్రిళ్లు ఆ పనులు కొనసాగిస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి



ఆర్వోబీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులతో ఒక టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేయాలి. ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించడంతోపాటు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు టాస్క్‌ఫోర్స్ సహాయకారిగా ఉంటుంది. పనుల్లో ఆలస్యం కారణంగా ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న ఆర్వోబీలను ప్రజలే వద్దనుకునే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి.

\-గోపీనాథ్ రెడ్డి, విశ్రాంత ఎస్ఈ

అడ్డంకులు తొలగితే ఆరు నెలల్లో పూర్తి

పీలేరులోని రెండు ఆర్వోబీలకు ఉన్న న్యాయ, రెవెన్యూ, విద్యుత్ అడ్డంకులు తొలగిపోతే కేవలం ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తాం. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని వసతులు సిద్ధంగా ఉన్నాయి. కేవలం కోర్టు కేసుల కారణంగా పనుల్లో ఆలస్యం జరుగుతోంది. ముందరి కాళ్లకు బంధం వేసి పరుగెత్తమని కోరినట్లు ఉంది మా పరిస్థితి. క్షేత్రస్థాయిలోని అడ్డంకులు తొలగకుండా మేం ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇదే విషయాన్ని స్థానిక అధికారులతో పాటు ఉన్నతాధికారులకు కూడా నివేదించాం. కోర్టు కేసులను త్వరలోనే ఒక కొలిక్కి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు జేసీ తెలిపారు.

\- మాధవన్, ఏఈ, నేషనల్ హైవేస్



నలుగురిని బలిగొన్న లారీ

ఘోరం

● కారుపై పడ్డ లారీ... నుజ్జునుజ్జు అయిన కారు

- లారీ రూపంలో కబళించిన మృత్యువు
- నలుగురుమృతి.. శోకసంద్రంలో మూడు పల్లెలు
- గువ్వలచెరువు ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- సొంతూరులో జాతరకు వస్తూ అనంతలోకాలకు
- భార్యాభర్తల ఆఖరిప్రయాణం..
- మృత్యువులో వీడని అక్కాతమ్ముడి బంధం

బద్వేలుటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు చిత్తూరు జాతీయ రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ వద్ద శనివారం ఉదయం కారుపై లారీ బోల్తాకొట్టడంతో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. ఈ ఘటనలో బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చింతపుత్తాయపల్లె గ్రామానికి చెందిన దంపతులు బసినేని శ్రీకాంత్‌రెడ్డి(32), భార్య బసినేని శిరీష(30).. బి.కోడూరు మండలం గంగిరెడ్డిపల్లెకు చెందిన అక్కాతమ్ముడు పి.సాయి హర్షిణి(11), రిషికేశ్ రెడ్డి(9) మృతిచెందారు. శశికళ, స్వర్ణలతలకు తీవ్రగాయాలు అయ్యాయి. మూడేళ్ల చిన్నారి రిషికకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా..

బద్వేలు మండలం చింతపుత్తాయపల్లె గ్రామానికి చెందిన బసినేని మల్లికార్జునరెడ్డి, సుజాతమ్మలకు ఇద్దరు కుమారులు. వారిలో ఒకరు బద్వేలు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్నారు. రెండవ కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, అతని భార్య శిరీష, మూడేళ్ల కూతురు రిషికతో కలసి బెంగళూరులో ఉంటున్నారు. దంపతులు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరు స్వగ్రామంలో జరిగే మండలపూజకు బంధువులతో కలసి మొత్తం ఏడుగురు కారులో వస్తుండగా.. మార్గమధ్యంలోని గువ్వలచెరువు ఘాట్ వద్ద రెప్పపాటులో వెనక వస్తున్న లారీ కారుపై పడింది. దీంతో కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో బసినేని శ్రీకాంత్‌రెడ్డి, అతడి భార్య బసినేని శిరీష, బి.కోడూరు మండలం గంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి, శశికళ దంపతుల కుమార్తె, కుమారుడు సాయిహర్షిణి, రిషికేశ్‌రెడ్డి మృతిచెందారు. ఇదే ఘటనలో గాయపడ్డ శశికళ, బి.కోడూరు మండలం మేకవారిపల్లెకు చెందిన స్వర్ణ, రిషికను కడప రిమ్స్‌కు తరలించారు.





కారులోంచి దంపతులు శిరీష, శ్రీకాంత్‌రెడ్డి మృతదేహాలను వెలికి తీస్తున్న దృశ్యం

మమ్మీ లే మమ్మీ... డాడీ లే డాడీ

తల్లిదండ్రులు బసినేని శిరీష, బసినేని శ్రీకాంత్ రెడ్డి విగతజీవులుగా పడి ఉండటం చూసి దిక్కుతోచని స్థితిలో చిన్నారి త్రిషిక గడిపిన తీరు అక్కడివారిని కలచివేసింది. మమ్మీ లే మమ్మీ.. డాడీ లే డాడీ.. అంటూ ఏడుస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. తన తల్లిదండ్రులు ఇక రారనీ, తనను విడిచి శాశ్వతంగా వెళ్లిపోయారని తెలియని స్థితిలో చిన్నారిపడిన వేదన అంతా ఇంతా కాదు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన రితేశ్‌రెడ్డి

విషయం తెలుసుకున్న బద్వేలు టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేశ్‌కుమార్ రెడ్డి హుటాహుటిన కడప రిమ్స్‌కు చేరుకుని ముందుగా క్షతగాత్రులను పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులను, కలెక్టర్‌ను కోరారు. అనంతరం మార్చురీకి వెళ్లి మృతదేహాలను సందర్శించి వెంటనే పోస్టుమార్టం చేయాలని వైద్యులను కోరారు. మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఆయనతో పాటు డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి వారిని పరామర్శించారు. అలాగే బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ కడప రిమ్స్‌కు చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

ఒకే ఒక్క ప్రమాదం..
చిన్నారికి తల్లిదండ్రులను దూరం చేసింది...
ఒకే ఒక్క ప్రమాదం కొడుకు కోడలిని దూరం చేసింది..
ఒకే ఒక్క దుర్ఘటన..
తల్లిదండ్రులకు కొడుకు కూతుళ్లను దూరం చేసింది.

గువ్వలచెరువు ఘటన వద్ద రహదారిపై రక్తం, కన్నీరు కలసి ప్రవహించాయి. రెప్పపాటున జరిగిన ప్రమాదంలో నాలుగు ప్రాణాలు గాలిలో కలసిపోయాయి. మృతులంతా బంధువులే.. వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని చింతపుత్తాయపల్లెలో ఆలయం మండలపూజ ఉంది. అలాగే మృతిచెందిన శ్రీకాంత్, శిరీష కుమార్తె రిషిక పుట్టెంట్రుకలు తీసే కార్యక్రమం ఉంది. ఈ రెండు శుభకార్యాలను చేసుకునేందుకు సొంతగ్రామానికి వస్తుండగా మృత్యువు కబళించింది. దీంతో మూడు గ్రామాల్లో తీవ్రశోకాన్ని నింపింది.



మృతిచెందిన శిరీష, శ్రీకాంత్‌రెడ్డిల ఫైల్‌ఫొటో

గంగిరెడ్డిపల్లెలో విషాదం

బి.కోడూరు మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కోగటం తిరుపతి రెడ్డి, శశికళ దంపతులు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ జీవిస్తుండేవారు. వారికి సాయిహర్షిణి, రిషికేశ్‌రెడ్డి పిల్లలు. 20 రోజులక్రితం ఉద్యోగరీత్యా తిరుపతిరెడ్డి జర్మనీ వెళ్లారు. చింతపుత్తాయపల్లెలో ఆదివారం జరిగే ఆలయ మండలపూజలో పాల్గొనేందుకు బంధువులతో కలిసి వస్తుండగా వీరి కారు గువ్వలచెరువు ఘాట్‌లో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో శశికళ ప్రాణాలతో బయటపడగా తన కుమార్తె, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో గంగిరెడ్డిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న తిరుపతిరెడ్డి జర్మనీ నుంచి బయల్దేరినట్లు బంధువులు తెలిపారు.

భగవంతుడా... మేమేం పాపం చేశాము



రిషికేశ్‌రెడ్డి ఫైల్ ఫొటో

గువ్వల చెరువు రోడ్డు ప్రమాదంలో తల్లి ఎదుటే చిన్నారులు సాయిహర్షిణి(11), రిషికేశ్‌రెడ్డి(9) మృతిచెందడంతో "దేవుడా మేమేం పాపం చేశాము.. మాకు ఎందుకు ఇంత అన్యాయం చేశావు.. కంటికి రెప్పలా కాపాడుకుంటున్న నా బిడ్డలను నాకు నాకు ఎందుకు దూరం చేశావ్.. నా బాధ ఎవరికి చెప్పుకోవాలి" అంటూ అక్కడ కళ్లెదుటే బిడ్డలను కోల్పోయిన తల్లి శశికళ ఆవేదన అక్కడ ఉన్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.



సాయిహర్షిణి ఫైల్ ఫొటో



అక్కాతమ్ముడు సాయిహర్షిణి, రిషికేశ్‌రెడ్డిల మృతదేహాలు

ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలి

● మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో జరిగిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనకై ఉపాధ్యాయ సంఘ నాయకులు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రపతి ఆమోదం కూడా పొందిన విషయాన్ని గుర్తు చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారం ద్వారా విద్యారంగం బలోపేతం కావడంతో పాటు ఏళ్లతరబడి పదోన్నతులకు నోచుకోని ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పదోన్నతులు పొందుతారని, జాప్యం లేకుండా అమలుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంతో కాలంగా తాము డిమాండ్ చేసిన శాశ్వత టీచర్ల బదిలీల చట్టం అమలులోకి తేవడం హర్షణీయమన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ ఇలియాస్ బాష, ప్రధాన కార్యదర్శి ఎస్.సంగమేశ్వరరెడ్డి, జిల్లా మున్సిపల్ కన్వీనర్ వై.అనిల్‌కుమార్, జిల్లా నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు



డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న శ్రీనివాసరాజు

కడప ఎడ్యుకేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలను ఎటువంటి అనుమానాలకు, అవాంతరాలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనవాసరాజు, కడప జిల్లా అధ్యక్షుడు ఏటీ రామకృష్ణంరాజు జిల్లా విద్యాశాఖాధికారులను కోరారు. శనివారం వివిధ సమస్యలపై నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కడప, అన్నమయ్య జిల్లా విద్యా శాఖ అధికారులు షేక్ షంషుద్దీన్, సుబ్రమణ్యంలను వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఆదేశానుసారం మాన్యువల్ కౌన్సిలింగ్ జరుగుతున్నందున ఉపాధ్యాయులు ఎవరు అసౌకర్యానికి గురి కాకుండా అన్ని వసతులతో నిర్ణీత సమయంలోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బదిలీల ప్రక్రియ నిర్వహణలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, వి.వేణుగోపాల్‌రావు, ఎన్‌టీఏ నాయకులు మురళీమోహన్‌రాజు, కట్ట గంగాధర్, వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పేరు మార్పుపై అభ్యంతరాలు నిల్

కడప, మే 24 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ జిల్లాగా ఉన్న పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ ఇటీవల ప్రభుత్వం మంత్రిమండలిలో నిర్ణయం తీసుకుంది. అభ్యంతరాల కోసం 30 రోజుల గడువు విధించగా.. ఎలాంటి అభ్యంతరాలు రాలేదు. కడప అనేది ఎంతో ప్రాచీనమైన, చరిత్ర గల పేరు. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలకు తొలిగడప కడప అని ఇలాంటి ప్రాచీనమైన చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అయితే రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కడప జిల్లాపై తన మార్కును చాటుకున్నారు. ఆయన మరణానంతరం వైఎస్సార్ జిల్లాగా మార్చారు. అయితే జిల్లాలో కడప పేరు తీసేయడాన్ని జిల్లావాసులు ఎవరు జీర్ణించుకోలేకపోయారు. తిరుమల తొలిగడప కడపను జిల్లా పేరు నుంచి తీసేయడాన్ని సహించలేకపోయారు. ఈ నేపథ్యంలో జనం నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు వైసీపీ హయాంలో నిరసనలు, అభ్యంతరాలు వచ్చాయి. అయితే జగన్ పట్టించుకోలేదు. అయితే ప్రజల మనోభావాల కారణంగా ఇటీవల సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన మంత్రి మండలిలో జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ గెజిట్ విడుదల చేస్తూ అభ్యంతరాలపై 30రోజులు గడువు ఇచ్చింది. అయితే గడువు పూర్తయినప్పటికీ కూడా పేరు మార్పుపై ఒక్క అభ్యంతరం కూడా రాకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో సోమవారం వైఎస్సార్ కడప జిల్లాగా అధికారిక ఉత్తర్వులు జారీ అవుతాయని తెలుస్తోంది.

28 నుంచి ప్రత్యేక కేటగిరీ సర్టిఫికెట్ల పరిశీలన

● నూజివీడు క్యాంపస్‌లో ఏర్పాట్లు

వేంపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో ప్రత్యేక కేటగిరీ విభాగంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 28వ తేదీ నుంచి సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ కన్వీనర్ అమరేంద్రకుమార్ సండ్ర ఒక ప్రకటనలో తెలిపారు. 28వ తేదీన క్యాప్, స్పోర్ట్స్, 29న క్యాప్, బీఎస్‌జీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కేటగిరీ, 30వ తేదీన ఎన్‌సీసీ, స్పోర్ట్స్, 31వ తేదీన ఎన్‌సీసీ కింద దరఖాస్తు చేసుకున్న ఆయా విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు.

ఇప్పటికే ఆయా విద్యార్థులకు సమాచారం ఇచ్చామని, నూజివీడు క్యాంపస్‌లో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు విద్యార్థులు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కేటగిరీలో క్యాప్ 270, బీఎస్‌జీ 247, ఎన్‌సీసీ 1,454, స్పోర్ట్స్ 1,032 మంది హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన సేవలందించడమే ధ్యేయం

● రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ

కడప మారుతీనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థలాలు, భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడమే ధ్యేయమని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఏదేని స్థలాలు, భూముల రిజిస్ట్రేషన్ పనుల విషయంగా నగరానికి కాస్త దూరంగా బుద్ధ టౌన్‌షిప్‌లో గల తమ కార్యాలయానికి రావాలంటే ప్రజలు ఒకింత అసౌకర్యానికి గురౌతున్నట్లు తెలిసిందన్నారు. ఆ లోటులేకుండా నగర నడిబొడ్డుగా భావించే పాత రిమ్స్‌లో ప్రభుత్వం 15 సెంట్ల స్థలాన్ని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి కేటాయించిందన్నారు. ఆ మేరకు శనివారం పాత రిమ్స్ వద్ద రిజిస్ట్రేషన్ సముదాయ భవనానికి కేటాయించిన స్థలంలో శిలాఫలకానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రిజిస్ట్రేషన్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద అధికారులు

కార్యక్రమంలో ఆర్డీవో జాన్ ఇర్విన్, దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటి వేణుగోపాల్, నగర అధ్యక్షుడు యు.సంజీవరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఓబులేసు, ఏపీ సబ్ రిజిస్ట్రార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అబీజుల్లా, జిల్లా రిజిస్ట్రార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు దొంగలు అరెస్టు

● బంగారు, వెండి నగలు స్వాధీనం

ఖాజీపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేటలోని వీఎస్ జ్యువెలరీ షాపులో చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగలను అరెస్టు చేసి, బంగారు వెండి నగలను స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం ఖాజీపేట పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఖాజీపేటలో గతనెల 12వ తేదీ వీఎస్ జ్యువెలరీ షాపులో చోరీకి పాల్పడిన నిందితులు శనివారం ఉదయం కడప ఇర్కాన్ సర్కిల్‌లో ఉన్నారని సీఐకి వచ్చిన సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎర్రగొళ్ల బసవరాజు, కె.సంజీవప్ప, యల్లప్పలను అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా జ్యువెలరీ షాపులో దొంగతనంతోపాటు మరో రెండు చోట్ల చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు జతల కమ్మలు, ఉంగరం, కాళ్ల గొలుసులు, వెండి మెట్టెలు, వెండి ప్లేట్లు, వెండి దీపాలు, కుంకుమ భరిణె స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చోరీ కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. కాగా, చోరీల నియంత్రణకు దుకాణాదారులు, ఇంటి యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ సూచించారు. ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి, సిబ్బంది సుధాకర్, తిరుమలయ్య, శివగణేష్, అమరేశ్వరరెడ్డి, నవీన్‌కుమార్, హోంగార్డు బాబు తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన నిందితులను చూపుతున్న డీఎస్పీ, సీఐ

టీటీడీ లీగల్ కౌన్సిల్‌గా జీఎస్ మూర్తి



జీఎస్ మూర్తి

కడప రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాది, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్ మూర్తిని తిరుమల తిరుపతి దేవస్థానం లీగల్ కౌన్సిల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన 1983 నుంచి టీడీపీలో కీలక కార్యకర్తగా పనిచేస్తూ పలు హోదాలలో పనిచేశారు. ఇదివరకు వరుసగా మూడు పర్యాయాలు జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్నారు. పలు కీలక కేసులలో విజయం సాధించారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జిల్లాలోని నాయకులకు, కార్యకర్తలకు న్యాయపరమైన సేవలు అందించారు. క్రిమినల్ కేసులలో పోలీస్ అధికారులకు న్యాయసలహాదారుగా పనిచేశారు. ఈయన సేవలను గుర్తించిన టీడీపీ అధిష్ఠానం టీటీడీ లీగల్ సెల్ కౌన్సిల్‌గా నియమించింది.

నేడు ఆచార్య మూల పుస్తక పరిచయ సభ

కడప మారుతీనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య మూలమల్లిఖార్జునరెడ్డి రచించిన రామాయణ, భారత, భాగవతాల్లో కొన్ని పాత్రలు పుస్తక పరిచయ సభను వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 25న ఆదివారం ఉదయం 9గంటలకు శ్రీరామక్రిష్ణ వానప్రస్థాశ్రమం, శ్రీరామక్రిష్ణ సేవా సమితి కడపలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రెవెన్యూఅధికారి ఎం.విశ్వేశ్వరనాయుడు, సభాధ్యక్షుడుగా శ్రీలక్ష్మిబాబు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాబురెడ్డి, పుస్తక పరిచయ కర్తగా వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం కార్యవర్గసభ్యుడు డాక్టర్ జీవీ సాయిప్రసాద్, విశిష్ట అతిథులుగా రాయలసీమ గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ రీజనల్ మేనేజరు జి.వెంకటసుబ్బారెడ్డి, శ్రీరామక్రిష్ణ వానప్రస్థాశ్రమం కార్యదర్శి జీ.సుబ్బిరెడ్డి, కోశాధికారి జి.శివరామిరెడ్డి, ఆత్మీయ అతిథులుగా కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, హిందూ ధర్మసమాజ ప్రార్థనా దేవాలయాల సంస్థ వైస్ ఛైర్మన్ కె.సోమ కళానాథరెడ్డి విచ్చేస్తున్నారని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం కార్యవర్గసభ్యులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి సభను నిర్వహిస్తారని అన్నారు.

'పంచాయతీకి వచ్చే అభివృద్ధి నిధులు ప్రజలవే'



దుగ్గనపల్లెలో ఏర్పాటు చేయబోయే మురుగుకాల్వ స్థలం పరిశీలిస్తున్న ఏఈ మల్లికార్జున

చెన్నూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీకి వచ్చే ఏ నిధులు అయినా అవి ప్రజలకు ఉపయోగపడేలా పంచాయతీ అభివృద్ధి జరిగేలా చూడాలని ఉప్పరపల్లె సర్పంచ్ శ్రీలక్ష్మి, స్థానిక నేత తుమ్మల త్రిలోక నాథరెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీలో ఇటీవల ప్రజలకు సరిగా అవసరమైన పనులను చేపట్టేందుకు రిజల్యూషన్ కావాలని అడిగితే ఇచ్చే ప్రసక్తిలేదని అవసరమైన పనులు చేపడితేనే గ్రామ పంచాయతీ నుంచి అనుమతిపత్రం ఇస్తామని ఆ గ్రామ సర్పంచ్ అన్నారు. శనివారం మండల పీఆర్ ఇంజనీరు మల్లికార్జున,పంచాయతీ కార్యదర్శి అన్వర్‌బాషాతో కలిసి గ్రామంలో ఎక్కడ ఏ పనులు చేపట్టాలో పరిశీలించారు.

మహానాడును విజయవంతం చేద్దాం

ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



పులివెందుల టీడీపీ కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, బీటెక్ రవి తదితరులు

పులివెందుల, మే 24 (ఆంధ్రజ్యోతి): కడపలో జరగబోయే టీడీపీ మహానాడు విజవయంతం కావడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి పనిచేయాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ అంజనేయులు సూచించారు. శనివారం మహానాడు ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన ఆయన పులివెందుల టీడీపీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహానాడు ఏర్పాట్లు, కార్యకర్తలకు కల్పించాల్సిన సౌకర్యాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహానాడుకు జనసమీకరణకు నేతల కసరత్తు

చెన్నూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలో జరిగే మహానాడు బహిరంగసభకు మండలంలో నుంచి భారీ ఎత్తున జనసమీకరణ చేసేందుకు మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి వచ్చే నేతలతో సమావేశం నిర్వహించారు. మహానాడుకు అత్యధిక సంఖ్యలో జనాలను తరలించే విధంగా చూడాలని ఆయా ప్రాంత బూత్ కమిటీ కన్వీనర్లు, నేతలకు మండల కన్వీనరు సూచించారు. పైగా కడప నగరంలో మొట్టమొదటిసారిగా జరిగే ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి, ఎమ్మెల్యేపుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సారథ్యంలో మండలంనుంచి భారీగా నేతలు, కార్యకర్తలు ప్రజలు మహానాడుకు తరలివచ్చి విజయవంతం అయ్యేలా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శివారెడ్డి, పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆకుల చలపతి, మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, కొండపేట మాజీ సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బీడాబాష, గౌస్‌పీర్, కొండాల చెన్నయ్య, మాజీ జడ్పీటీసీ చిన్నయ్య, సంజీవ్‌పవన్, భవానీ ఆచారి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ బుజ్జన్న, గోడెన శ్రీనివాసుల, కుందేటి క్రిష్ణయ్య, ఆటోబాబు తదితరులు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయండి

కమలాపురం రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం నియోజకవర్గంలో టీడీపీరాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి, పుత్తాక్రిష్ణచైతన్య రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే మహానాడును విజయవంతం చేయాలని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా తెలిపారు. మహానాడును కమలాపురం నియోజకవర్గంలోనే జరగడానికి ముఖ్య కారణం పుత్తా నరసింహారెడ్డి అని గత నాలుగు దఫాలుగా జరిగిన ప్రతి బహిరంగసభ కమలాపురం నియోజకవర్గంలోని విజయవంతంగా జరిగిందని ఆ నమ్మకంతోనే ఈ సారి కూడా పుత్తా కుటుంబానికి ఆ బాధ్యతలు అప్పజెప్పడం జరిగిందని ఆయన తెలిపారు.

కడప నాగరాజుపేట..: మహానాడు విజయవంతం కోసం కడప పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ సీనియర్ కార్యకర్త, 27వ డివిజన్ 165వ బూత్ ఇన్‌చార్జి షేక్ అమానుల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

ఆరోగ్య మాత చర్చిలో ప్రార్థనలు

కడప ఎర్రముక్కపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నియోజకవర్గ పబ్బాపురంలో ఈనెల 27, 28, 29వ తేదీలలో జరిగే మహానాడు కార్యక్రమం విజయవంతం కావాలని నగర ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య కోరారు. శనివారం కడప నగరం ఆరోగ్య మాత చర్చిలో పాస్టర్ మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా పాత బస్టాండ్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం, రెండో దశగా అమీన్‌పీర్ దర్గా, మేరీ మాత చర్చిలో ప్రార్థన నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతిక కార్యనిర్వాహక కార్యదర్శి అబ్దుల్ రాయల్ కరీముల్లా, సిస్టర్ సరీన, ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

కడప(వినాయకనగర్)..: కడపలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమం తిరుమల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో విజయవంతం కావాలని కోరుతూ శనివారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో టీడీపీ నాయకులు మలిరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వరస్వామి వారి ప్రసాదాలు అందజేశారు. మహానాడు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త, నాయకుడు,కుటుంబ సభ్యులు, టీడీపీ అనుబంధ సంఘాలన్నీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

ఇంటిని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

దళిత హక్కుల పోరాట సమితి

కడప(వినాయకనగర్), మే24(ఆంధ్రజ్యోతి): నగరంలోని శివానందపురంలో దళిత వృద్ధురాలు పిచ్చమ్మ ఇంటిని కూల్చివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం దళిత హక్కుల పోరాట సమితి జిల్ల అధ్యక్ష, కార్యదర్శులు నాగదాసరి ఇమ్మానియేల్ కానగలమునెయ్య, జిల్లా సమితి నాయకులు పాలెంపల్లి చంద్రగుప్త తదితర నాయకులు శివానందపురంలో భూమన పిచ్చమ్మ ఇంటిని కూల్చివేత ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు వెంకటేశు, ప్రసాద్, శ్రీను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్ సేవ ద్వారా పోలీసు భద్రత

కడప క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో శక్తి యాప్ మహిళలు, బాలికలకు ఎంతగానో ఉపయోగపడుతుందని శక్తి టీమ్ మహిళా ఎస్.ఐ. శాంతమ్మ అన్నారు. శనివారం నగర ఎస్‌వీ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులకు ఎస్.ఐ. శాంతమ్మ ఆధ్వర్యంలో శక్తి యాప్ ఆవశ్యకత ప్రాధాన్యత గురించి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా శాంతమ్మ మాట్లాడుతూ మహిళలు చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 100, 112, చైల్డ్ లైన్ 1098, గృహహింస 181, మహిళ వేధింపులు 1091, సైబర్ టోల్‌ఫ్రీ 1930, సైబర్ మిత్ర, సంబంధిత పోలీస్ వారిని తక్షణమే సంప్రదించాలన్నారు.

నేడు ఒంటిమిట్టలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కడప ఎడ్యుకేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 25వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులను సన్మానించడం, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించి పాఠశాలకు సహకారం అందించనున్నట్లు తెలిపారు. సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఈ సమావేశంలో మిత్రులందరితో కలిసి చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పూర్వ విద్యార్థులందరికీ సమాచారం అందించామని, 1993-94లో ఒంటిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఫోరం ఫర్‌బెటర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి అనేక ముఖ్యమైన రంగాలలో చర్యలు చేపట్టాలని ఫోరం ఫర్ బెటర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేష్‌బాబు, కార్యదర్శి బి.విశ్వనాథ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటుచేసిన ఫోరం సమావేశంలో వారు మాట్లాడుతూ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ, ఇతర పారిశ్రామిక సంస్థల ఏర్పాటుచేయాలన్నారు. కడప-రాజంపేట మధ్య ఐటీ కారిడార్ స్థాపన, కడప నుంచి ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి దేశంలోని ప్రధాననగరాలకు విమాన సర్వీసులు ప్రారంభం,కడప విమానాశ్రయంలో నైట్ ల్యాండింగ్ సౌకర్యం ఏర్పాటుచేయాలన్నారు. కడప-విజయ వాడల మధ్యప్రత్యేక రైలు ప్రారంభం, జిల్లాలో నీటి పారుదల ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తిచేయడం, జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు,పర్యాటక ప్రాంతాల అభివృద్ధి తదితర అభివృద్ధి కార్యక్రమాల ద్వారా జిల్లా సమగ్రాభవృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేయాలని డిమాండ్ చేశారు. సమావేవంలో నాయకులు మహబూబ్ బాష, మస్తాన్‌బాబు,రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీఎన్‌పల్లెలో బీజేపీ కార్యాలయం ప్రారంభం



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

వీరపునాయునిపల్లె, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో శనివారం సాయంత్రం బీజేపీ మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. మండల బీజేపీ అధ్యక్షుడు తులసినాయుడు ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ సురేష్‌రెడ్డిల చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం వీరపునాయునిపల్లెలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రముఖులు రఘునాథరెడ్డి, భూషణ్‌రెడ్డి, ఓబులేసు, రాజేష్,మధు, చంద్రహాస్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



వల్లూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుమారునిపల్లె వద్ద ఉన్నవరాల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం బండలాగుడు పోటీలను కార్యనిర్వాహకులు కల్లూరు బ్రదర్స్ నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా అంజనేయస్వామికి విశేషంగా పంచామృతాభిషేకాలు చేశారు. అలాగే బండలాగుడుపోటీలు చేశారు. మొదటి బహుమతి రూ.30,016, ప్రొద్దుటూరు అయోధ్య నగర్‌కు చెందిన లక్ష్మణకుమార్ గెలుచుకోగా, రెండో బహుమతి రూ.20,016 రంగోడుపల్లె గ్రామం పవన్‌కుమార్‌రెడ్డి ఎద్దులు గెలుచుకున్నాయి. మూడో బహుమతి రూ.15016ను కడప దాసరిపల్లెకు చెందిన అశోక్ ఎద్దులు గెలుచుకున్నాయి. రాత్రి అంజనేయస్వామి దేవస్థానంలో భజనలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ యువనేత, ఎమ్మెల్యే సోదరుడు సాయి నరసింహారెడ్డి ఆంజ నేయస్వామి దేవస్థానం వద్దకు వచ్చిన ప్రత్యేకపూజలు చేశారు. ఆయన వెంట నాయకులు, పుత్తా అనుచరులు పాల్గొన్నారు.

యంత్రాలు పనిచేయవు.. రైతులకు సేవలందవు..!

ఆర్‌బీకేలలో నిరుపయోగంగా ఉన్న యంత్రాలు



నిరుపయోగంగా ఉన్న కియోస్కో యంత్రం

కమలాపురం రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు సొంత ఊరిలోనే పంటల సాగుకు అవసరమైన ప్రయోజనాలను మెలకువలను తెలుసుకునేందుకు రైతులకు అన్ని సేవలు ఒకే చోట అందే విధంగా రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం అసమర్థతతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. రైతులకు నాణ్యమైన సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సాగుదారులు రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేసేందుకు వీలుగా రూ.కోట్లు ఖర్చు చేసే ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాలు రెండేళ్లకే మూలకు చేరాయి. ప్రారంభంలో యంత్రాల ద్వారా అరకొర సేవలందించినా కొద్దిమంది మాత్రమే ఎరువులు, పురుగు మందులు యంత్రాల ద్వారా కొనుగోలు చేశారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లోని యంత్రాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. అధికారులు, సిబ్బందితో సంబంధం లేకుండా రైతులే ఆర్బీకేలకు వచ్చి స్వయంగా తమకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను అవసరమైన పరిమాణంలో కియోస్కో యంత్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చు. తరువాత నేరుగా రైతుల ఇంటికే వాటిని సరఫరా చేస్తారు అన్నదాతలకు వీటిపై అవగాహన కల్పించకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో నిరుపయోగంగా మారాయి. రూ.వేలల్లో ఖర్చు నియోజకవర్గంలోని కమలాపురం, వల్లూరు, చెన్నూరు, సీకేదిన్నె, పెండ్లిమర్రి, వీఎన్‌పల్లె మండలాల్లో 75 రైతు సేవాకేంద్రాల్లో 2020లో కియోస్కో యంత్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో యంత్రానికి రూ.80వేలు ఖర్చు చేశారు. మొదటి ఏడాదిలో పత్తి, మిరప తదితర పంటల విత్తనాలను రైతులు యంత్రాల ద్వారా బుక్ చేసుకున్నారు. ఏడాదిన్నర వరకు పురుగు మందులు, ఎరువులు కొనుగోలుకు వినియోగించారు. 2023 నుంచి యంత్రాల వినియోగం పూర్తిగా తగ్గిపోయింది.

సేవలన్నీ సెల్‌ఫోన్‌ల్లోనే..: ప్రస్తుతం గ్రామ స్థాయిలో పనిచేసే వీఏఏలు, ఎంపీఈవోలు ఎరువులు, పురుగు మందులు విత్త నాలు, యంత్రాలు, యంత్ర పరికరాలు, ఈపంట నమోదు తదితర విషయాలు సెల్‌ఫోన్‌ల ద్వారానే నమోదు చేస్తున్నారు. వాతావరణ సమాచారం మార్కెట్ ధరలు తదితర సేవలన్నీ సెల్‌ఫోన్‌ల్లోనే తెలుసుకునే అవకాశం ఉంది. దీంతో కియోస్క్‌లు మూలకు చేరాయి. యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ప్రస్తుతం అన్ని సేవలు సెల్‌ఫోన్‌ల్లోనే అందిస్తున్నాం. సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

- నరసింహారెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకుడు, కమలాపురం

లైంగికదాడి నిందితుడిని కఠినంగా శిక్షించాలి



సీఐ చాంద్‌బాషకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

పులివెందుల, మే 24 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిననిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ సమన్వయకర్త కొమ్మునాగేశ్వరరావు, గంగన్న, ఎంఈఎఫ్ నాయకులు చరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం అర్బన్ సీఐ చాంద్‌బాషను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

కడప,కలెక్టరేట్..: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన కామాంధున్ని కఠినంగా శిక్షించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి పాశవిక చర్యలు మన సమాజాన్ని కలిచివేస్తున్నాయని, మానవ మృగాలు చేస్తున్న అఘాయిత్యాలను తక్షణమే ఖండించాలన్నారు.

యోగా దినోత్సవం విజయవంతం చేద్దాం

వేముల, మే 24 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని విజయవంతం చేద్దామని వెలుగు ఏపీఎం ఆంజనేయులు పేర్కొ న్నారు. శనివారం స్థానిక కార్యాల యంలో డ్వాక్రా మహిళలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించడం కోసం చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ జ్యోతి, గ్రామ సమాఖ్య అసిస్టెంట్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుఫ్యాక్టరీపై స్పష్టమైన ప్రకటన చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న తులసిరెడ్డి

కడప మారుతీనగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఈనెల 26 నుంచి 29 వరకు కడపలో తలపెట్టిన మహానాడు కార్యక్రమంలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు. విభజన హామీలను త్వరిత గతిన అమలు చేసి పెండింగ్‌లో వున్న నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తికి తగిన నిధులు కేటాయించాలని ఇండియా కూటమి నాయకులు ఎన్.తులసిరెడ్డి, జి.ఈశ్వరయ్య, కత్తి నరసింహారెడ్డి, జి.చంద్రశేఖర్, గుంటి వేణుగోపాల్ కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అధ్యక్షతన శనివారం ఉక్కు సాధన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007 జూన్ 10న జమ్మలమడుగు మండలంలో బ్రహ్మణి ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. కానీ కొన్ని ఆరోపణలతో కేటాయింపులన్నీ రద్దు చేశారన్నారు. దీంతో బ్రహ్మణి స్టీల్ ప్లాంట్ స్థానంలో ప్రభుత్వమే ఉక్కు ఫ్యాక్టరీ చేపట్టాలని సీపీఐ, ప్రజా సంఘాల నేతృత్వంలో ఉద్య మాలు చేపట్టడంతో 2014 మార్చి 1న రాష్ట్ర విభజన బిల్లులో ఉక్కుఫ్యాక్టరీని చేర్చారని గుర్తుచేశారు.

రాష్ట్ర విభజనానంతరం కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ ఏర్పాటు కావడం... 2018 డిసెంబర్ 27న మైలవరం మండలం కంబాలదిన్నెలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి 3వేల ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ పరిశ్రమ ఏర్పాటు కాలేదన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి సైతం శంకుస్థాపన చేశారన్నారు. ఫ్యాక్టరీ మాత్రం నిర్మాణానికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

పోరుమామిళ్ల, మే 24(ఆంధ్రజ్యోతి): గువ్వలచెరువు రెండోఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. శనివారం ఆయన స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సంఘటన బాధాకరమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగ ప్రధాన కార్యదర్శి ఆదిత్యరెడ్డి, రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

కొండాపురం, మే 24(ఆంధ్రజ్యోతి): కొండాపురం ఎంపీడీవో కార్యాలయాన్ని శనివారం జడ్పీ సీఈవో ఓబుళమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలోని సిబ్బంది హాజరు, తదితర రికార్డులను తనిఖీ చేశారు. వచ్చే నెల 21వ తేదీ వరకు నెలరోజుల పాటు యోగా దినోత్సవం జరుపుతున్నందున, అందుకు సంబంధించిన వివరాలను సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో రామయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం


యోగా చేస్తున్న ఎంపిడీవో కార్యాలయ సిబ్బంది

ఎర్రగుంట్ల, మే 24(ఆంధ్రజ్యోతి): తీవ్ర ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు యోగా ఎంతో ఉపశమనం కలిగిస్తుందని ఎంపిడీవో వెంకటరమణయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఎర్రగుంట్ల ఎంపిడీవో కార్యాలయంలో ప్రభుత్వ సిబ్బందికి యోగాపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ క్రమం తప్పకుండా యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రంతులయ్య, సచివాలయ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా కక్షిదారులైన 1)కీ॥శే॥ కాకుమాని నారాయణ స్వామి గారి కుమారుడు కాకుమాని జనార్ధన వయస్సు 69సం. ఈయన భార్య 2) కాకుమాని శ్రీలక్ష్మి వయస్సు 67 సం.లు, ఇద్దరు సాకిన్ డి.నెం. 3/223/13 సాయికుటీర్ రోడ్, వైఎంఆర్‌కాలనీ, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, వైఎస్ఆర్ కడపజిల్లాగార్ల వలన సరియైన ఇన్‌స్ట్రక్షన్స్‌పొంది ఇచ్చు పబ్లిక్ నోటీసు ఏమనగా నా కక్షిదారుల కుమారుడైన కాకుమాని సుబ్రమణ్యం (సుబ్బు)కు నా కక్షిదారులకు మధ్య రక్తసంబంధం తప్ప మరే ఇతర సంబంధం లేదు. నా కక్షిదారుల యొక్క ఉండబడు ఆస్తులు వారి స్వార్జితపు ఆస్తులు. కాబట్టి సదరు కాకుమాని సుబ్రమణ్యం యొక్క చర్యలకు అనగా అప్పులకు, గ్యారంటీలకు, ష్యూరిటీలకు, ఆర్థిక మరియు వ్యాపార కార్యకలాపాలకు, అన్ని రకాల కార్యకలాపాలకు నా కక్షిదారులు బాధ్యులు కారు, జవాబుదారి కాదు. వారికి వర్తించవు. వారికి ఎటువంటి సంబంధం లేదు. ఉండదు మరియు ఉండబోదు.

ఇట్లు
విశ్వనాథం రమేష్‌బాబు, అడ్వకేట్, డి.నెం. 8/581, గిడ్డంగివీధి, ప్రొద్దుటూరు, సెల్ : 9441500950

దళితవాడకు రోడ్డు వేయరా..!

వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేశారు. దీంతో గ్రామాల్లో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా రోడ్లు లేని దుస్థితిలో గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. కానీ గ్రామాలకు ఉపాధి నిధులు ఇచ్చినా అగ్రవర్ణాలున్న గ్రామాల్లో మాత్రమే స్థానిక నాయకులు వినియోగించుకుని, దళితులు, వెనుకబడిన వర్గాలున్న ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



- వర్షాలొస్తే ఆ దారిలో వెళ్లలేని దుస్థితి
- బురదమయమైన కచ్చాదారులు

ప్రొద్దుటూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం పెద్దశెట్టిపల్లె పంచాయతీ శంకరాపురం గ్రామంలోని దళితవాడల అభివృద్ధిని స్థానిక నాయకత్వం పట్టించుకోవడం లేదని దళితులు వాపోతున్నారు. ముఖ్యంగా దళితవాడకు వెళ్లేందుకు కనీసం ఇన్నేళ్లలో మెటల్‌రోడ్డు కూడా వేయలేదని ఆవేదన చెందుతున్నారు.

వర్షాలొస్తే ఆ దారిలో ప్రయాణం.. నరకం..

వర్షాలొస్తే శంకరాపురం ఊరిలో నుండి దళిత వాడకు వెళ్లేదారి బురదమయం అవుతుంది. దీంతో ఆ దారిలో వెళ్ళాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు వేయాలని ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్నా అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ఉపాధి నిధులు రోడ్ల మీద రోడ్డు వేయడానికా..

శంకరాపురం గ్రామాభివృద్ధికి ఉపాధి నిధుల కింద నిధులు ఇచ్చినా స్థానిక నాయకులు మాత్రం రోడ్లమీద రోడ్లు వేయడానికి వినియోగిస్తున్నారు. కనీసం కచ్చా రోడ్డు కూడా లేని దళితవాడకు రోడ్డు వేయాలని తలచడం లేదని ఆరోపిస్తున్నారు.


మెటల్ రోడ్డుకు కూడా నోచుకోని శంకరాపురం దళితవాడకు వెళ్లే దారి

సీసీ రోడ్డు వేయండి..



శంకరాపురం దళితవాడను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. శంకరాపురంలో ఉపాధి నిధుల కింద రోడ్లు వేశారు కానీ దళితవాడను మరిచిపోయారు. కనీసం సీసీరోడ్డు కూడా లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దళితవాడకు సీసీరోడ్డు వేయాలి.

- దండే కొండయ్య, శంకరాపురం దళితవాడ

చిన్నారి హత్య ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ

మైలవరం, మే 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎ.కంబాలదిన్నె గ్రామంలో చిన్నారిని అత్యాచారం చేసి చంపి పడవేసిన సంఘటన స్థలాన్ని శనివారం ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. కేసు పురోగతిపై దర్యాప్తు అధికారి జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. హత్య జరిగిన ప్రాంతంతో పాటు చర్చి ప్రాంతాన్ని పరిశీలించారు. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి, తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్లు

ఖాజీపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోసిరెడ్డిపల్లెలో వెలసిన పోలేరమ్మ తిరుణాళ్లను ఘనంగా నిర్వహించారు. శనివారం జాతర సందర్భంగా అమ్మవారికి బోనాలు గ్రామమహిళలు సమర్పించారు. అనంతరం బండలాగుడుపోటీలు ఏర్పాటు చేసి గెలుపొందిన వృషభరాజములకు ఆలయ కమిటీ నగదు బహుమతులను అందజేశారు.

మహానాడును విజయవంతం చేయండి


మాట్లాడుతున్న రితేష్‌రెడ్డి.. చిత్రంలో విజయమ్మ తదితరులు

కలసపాడు/పోరుమామిళ్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పిలుపునిచ్చారు. ఈనెల 29న జరగే మహానాడు బహింరగ సభకు జనసమీకరణపై శనివారం సాయంత్రం కలసపాడులో, రాత్రి పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ పరిధిలోని సీసీఆర్ కాంప్లెక్స్‌లో కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి యువత, మహిళలు, రైతులు, భారీగా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో కూటమి అభ్యర్థి రోశన్న, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు రంతు, చెరుకూరి చెన్నరాయుడు, టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకటరామిరెడ్డి, పట్టాభిరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, నగిరి భైరవప్రసాద్, సర్పంచ్ యనమల సుధాకర్, కె.రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

రాజుపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దారు వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి వద్దకే నిత్యావసర వస్తువులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాలను ప్రభుత్వం రద్దు చేయడంతో షాపుల వద్దనే రేషన్ పంపిణీ చేయాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఆటంకం లేకండా పంపిణీ ఉండానల్నారు. అలాగే రేషన్‌కార్డులో సభ్యుల విభజనకు సేవా రుసుం రూ.48, కొత్తరేషన్‌కార్డుకు, సభ్యుల చేర్పుల వివరాలు ఇతర సేవలకు రూ.24 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టరు హుసేనరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారులు, చౌక దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

రేపు బీసీల ఆత్మీయ సమ్మేళనం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): బీసీల ఆత్మీయ సమ్మేళనం ఈనెల 26వ తేదీ కేసీపీ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నామని బీసీ సమాఖ్య సహ అధ్యక్షుడు సందు శివనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆత్మీయ సమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి బీసీలు రాజ్యాధికారం కోసం, సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తున్నారని, బీసీల అభివృద్ధి కోసం రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సుదీర్ఘ కాలం నుండి పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. ఆయన కృషితో కులగణన చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందని, ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమ్మేళనానికి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు లూకాలమ్మ పాల్గొంటారని, బీసీలు ఈ సమాశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ రాజు, జిల్లా అధ్యక్షుడు జింకా జయప్రకాశ్, జాయింట్ సెక్రటరీ రమేష్, పుల్లయ్య, రామసుబ్బయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కృషి చేయాలని అమెరికా నుంచి నరాల చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల్లో పట్టణంలోని మున్సిపల్ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు ఆయన తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నగదు పురస్కారాలను అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన రామేశ్వరం మున్సిపల్ హైస్కూలు విద్యార్థి సాదిక్‌కు రూ.25 వేలు, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు విద్యార్థులు దివ్య, స్నేహితలకు రూ.20 వేలు వంతున, నడింపల్లె మున్సిపల్ హైస్కూలు విద్యార్థి చరణ్‌కు రూ.15 వేలు, వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు, రామేశ్వరం మున్సిపల్ హైస్కూలుకు చెందిన మనీషా, కరుణశ్రీ, తేజలకు రూ.5 వేలు వంతున నగదు పురష్కారాలను అందజేశారు. కార్యక్రమంలో సీబీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, ఎస్‌కేఎస్‌ఈ డిగ్రీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, హెచ్ఎం అల్తాఫ్, రిటైర్డు హెచ్ఎం కాశీప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కథలు జీవిత సత్యాలను ప్రతిబింబించాలి


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసమూర్తి

ప్రొద్దుటూరు టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): కథా రచనలలో జీవిత సత్యాలను ప్రతిబింబించే విధంగా రచనలు చేయాలని రచయిత డాక్టర్ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. శనివారం జేవీవీ కార్యాలయంలో రెండు రోజుల కథావసంతం కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లల్లో కథా రచనలో సృజనాత్మకతను పెంచాలన్న లక్ష్యంతో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మానవ సంబంధాల గురించి వివరిస్తూ కథలలో హాస్యకథలు, జంతువుల నీతికథలు, విద్యాబోధన కథలుగా విభజించి ఉంటాయన్నారు. కథల ద్వారా పిల్లల్లో ఊహాశక్తి పెరుగుతుందని, కథలలో పర్యావరణ అంశాన్ని జోడించడం వలన పర్యావరణ స్పృహ అలవడుతుందన్నారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ కథా వర్క్‌షాప్‌లో విద్యార్థులు రాసే కథలను పుస్తక రూపంలో వెలువరిస్తామన్నారు. కార్యక్రమంలో రచయిత మాధవి, జేవీవీ నాయకులు సునీత, మురళీగుప్త, సూర్యనారాయణరెడ్డి, రాజేష, శిరీష, లీలా, రాజశేఖర్ పాల్గొన్నారు.

మోడల్ డీఎస్సీని సద్వినియోగం చేసుకోవాలి



ప్రొద్దుటూరు టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): డీవైఎఫ్ఐ నిర్వహించే మోడల్ డీఎస్సీ పరీక్షను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఈవో మీనాక్షి పేర్కొన్నారు. శనివారం మోడల్ డీఎస్సీ పరీక్ష కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. అనంతరం డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ ఎస్‌జీటీ అభ్యర్థుల కోసం మోడల్ డీఎస్సీ నిర్వహిస్తున్నామని, కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, జమ్మలమడుగులలో పరీక్ష నిర్వహిస్తామని, డీఎస్సీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నేతలు మేరీకుమార్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

రుగ్మతల పట్ల అప్రమత్తత అవసరం

దువ్వూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): మానసిక రుగ్మతల పట్ల అప్రమత్తత అవసరమని మానసిక వైద్యురాలు ఎన్.కవితాప్రసన్న తెలిపారు. దువ్వూరు ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానసిక రుగ్మత కలవారి ప్రవర్తనలో మార్పులు చోటు చేసుకుంటాయని, ఇలాంటి లక్షణాలు కనిపించిన వారిని ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్‌బాబు, రోషిణి, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఖాజీపేట, మే 24(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ వీరయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని తవ్వారు పల్లెలో సాగు చేసే పత్తి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాన్‌బీటీ విత్తనాలు సాగు చేసేటప్పుడు అధికారుల సూచనలు తీసుకోవాలన్నారు. బీటీ-3 పత్తి విత్తనాలు ఎక్కడైనా అమ్ముతున్నట్లు తెలిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి నాగార్జున, డాక్టర్ శ్రీవల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైశాఖ మాసం చివరి శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు పెంచలయ్యస్వామి మాట్లాడుతూ వచ్చే నెలలో పెంచలకోనకు మహా పాదయాత్ర ఉంటుందన్నారు.

నిందితుడికి కఠిన శిక్ష పడేలా కృషి

- చిన్నారి మృతదేహాన్ని సందర్శించిన భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, మే 24 (ఆంధ్రజ్యోతి): చిన్నారి మృతికి కారణమైన వాడికి కఠిన శిక్ష పడేందుకు తనవంతు కృషి చేస్తానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో ఎ.కంబాలదిన్నె గ్రామంలో జరిగిన ఘటనకు సంబంధించి చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడి ఓదార్చారు. ప్రభుత్వపరంగా న్యాయం జరుగుతుందని, అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ సంఘటన తనను మనోవేదనకు గురిచేసిందన్నారు. అలాగే జనసేన నియోజకవర్గ కన్వీనర్ నల్లంశెట్టి నాగార్జున, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు మద్దూరి రామకృష్ణ చిన్నారి మృతదేహాన్ని సందర్శించి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్నాటి రామాంజనేయులరెడ్డి, వంగల నాగేంద్రయాదవ్, టంగుటూరి విశ్వనాథరెడ్డి, గండికోట కిరణ్, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

హంతకుడికి కఠిన శిక్ష విధించాలి : ఎస్టీయూ

జమ్మలమడుగు, మే 24 (ఆంధ్రజ్యోతి): సభ్యసమాజం తలదించుకునేలా చిన్నారి మృతికి కారణమైన వ్యక్తికి ప్రభుత్వం కఠిన శిక్షించ విధించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్ డిమాండ్ చేశారు. శనివారం జమ్మలమడుగులోని ఎస్టీయూ రీజియన్ కార్యాలయంలో ఎస్టీయూ ఉపాధ్యాయులు ప్రత్యేక సమాశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నారి మృతి అత్యంత బాధాకరమన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరుగకుండా పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు మహ్మద్‌గౌస్, శివకుమార్‌రెడ్డి, శివరామిరెడ్డి, లక్షుమయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఉన్మాదికి ఉరి శిక్షే సరైనది'

జమ్మలమడుగు, మే 24 (ఆంధ్రజ్యోతి): సభ్యసమాజం తలదించుకునే విధంగా కంబాలదిన్నె గ్రామంలో జరిగిన ఘటనకు సంబంధించి కామాంధుడికి ఉరి శిక్షే సరైందని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ అభిప్రాయపడ్డారు. శనివారం జమ్మలమడుగులోని ఎన్జీవో హోంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి సరైన న్యాయం జరుగాలని కోరారు. అలాగే ఎమ్మార్పీఎస్, ఆర్ఎస్‌వో, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు.

మానవమృగాన్ని ఉరి తీయాలి

బద్వేలు ,మే24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసి హతమార్చిన రహమతుల్లా అనే మానవమృగాన్ని ఉరి తీయాలని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా, బద్వేలు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆవాజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇలాంటి వ్యక్తులు సమాజంలో ఉంటే ఎప్పటికైనా ప్రమాదకరమేనని, అతడికి ఉరే సరైన శిక్ష అన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు రసూల్, ఖాజా గౌస్, మస్తాన్, అన్వర్, నాగూర్ పాల్గొన్నారు.

కామాంధుడిని కఠినంగా శిక్షించాలి

మైలవరం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంబాలదిన్నె గ్రామంలో పసికందుపై అత్యాచారం చేసి చంపిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ డిమాండ్ చేశారు. శనివారం మైలవరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితుడిని కఠినంగా శిక్షించినప్పుడే మరొకరికి ఇటువంటి ఆలోచనలు రావన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు కొండయ్య, మోహన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలం కంబాలదిన్నెలో శుక్రవారం అభం శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితుడి ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని విద్యార్థి, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శనివారం విద్యార్థి సంఘాల నాయకులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, ఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ రమేష్ పాల్గొన్నారు. అలాగే చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, విజయ, లక్ష్మీదేవి, చంద్ర, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇర్ఫాన్‌బాష నిందితుడిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

ఎ.కంబాలదిన్నెలో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా పట్టణాధ్యక్షురాలు సర్వేశ్వరి, కార్యదర్శి ముతాంజ్‌బేగంలు పేర్కొన్నారు. సంఘం కార్యాయంలో శనివారం వారు మాట్లాడుతూ నిందితుడికి ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, మౌనిక, వైష్ణవి, కరిమూన్ పాల్గొన్నారు.

షాపుల వద్దే రేషన్ పంపిణీ

అట్లూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): షాపుల వద్దనే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దారు శిరీష తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో జూన్ 1 నుండి ప్రతి రేషన్‌కార్డుదారునికి సక్రమంగా రేషను పంపిణీ చేయాలని సూచించారు. పర్మినెంటుగా లేని డీలర్ల స్థానంలో డ్వాక్రా మహిళలతో పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా డీలర్లు పలు సమస్యలు ఆమె దృష్టికి తెచ్చారు. స్టాకు పాయింటు వద్ద తూకాలతో ఇవ్వకుండా గంపగుత్తుగా ఇస్తున్నారని, ఈ-పాస్ మెషీన్లు సరిగా పనిచేయడం లేదని విన్నవించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణ, వీఆర్వోలు, డీలర్లు పాల్గొన్నారు.

15 వరకు పంపిణీ జరగాలి

కొండాపురం, మే 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ సక్రమంగా జరగాలని తహసీల్దార్ గురప్ప డీలర్లను ఆదేశించారు. శనివారం మండలంలోని డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆర్ఐ మహేశ్వరరెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఇంటికే రేషన్

దువ్వూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాలకు సంబంధించిన నిత్యావసర వస్తువులను దివ్యాంగులకు, 65సంవత్సరాలు పైబడిన వారి ఇంటికి వెళ్లి పంపిణీ చేయాల తహసీల్దారు అక్బల్‌బాష సూచించారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. స్టాకు, సేల్స్ రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీటీ వేణుగోపాల్, డీలర్లు పాల్గొన్నారు.

ఇంటిని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

కడప(వినాయకనగర్), మే 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని శివానందపురంలో దళిత వృద్ధురాలు పిచ్చమ్మ ఇంటిని కూల్చివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం దళిత హక్కుల పోరాట సమితి జిల్ల అధ్యక్ష, కార్యదర్శులు నాగదాసరి ఇమ్మానియేల్ కానగలమునెయ్య, జిల్లా సమితి నాయకులు పాలెంపల్లి చంద్రగుప్త తదితర నాయకులు శివానందపురంలో భూమన పిచ్చమ్మ ఇంటిని కూల్చివేత ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు వెంకటేశు, ప్రసాద్, శ్రీను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.